క్లుప్తంగా

ఆలయ మరమ్మతులు ప్రారంభం



కొబ్బరి కాయకొట్టి పనులు ప్రారంభిస్తున్న ట్రస్టు బోర్డు చైర్మన్ ప్రదీప్ తదితరులు

సీటీఆర్ఐ: గోదావరి గట్టున ఉన్న ఉమామార్కండేయేశ్వర స్వామివారి దేవాలయ అభివృద్ధి పనులను శనివారం ప్రారంభించారు. ఈ పనులను దేవస్థానం ట్రస్టు బోర్డు చైర్మన్ ఇన్నమూరి ప్రదీప్ కొబ్బరికాయ కొట్టి ప్రారంభించారు. ఆలయ గోపురం మరమ్మతులు, రంగులు వేయడం, ధ్వజస్తంభ పునర్నిర్మాణం తదితర పనులు చేయనున్నారు. కార్యక్రమంలో ట్రస్టుబోర్డు సభ్యులు యజ్జవరపు శ్రీనివాసరావు, కేదారిశెట్టి వనిత, ఎరకల రజిని, వియ్యపు రాఘవేంద్రరావు, సలా సావిత్రి, దాసరి శివప్రసాద్, గుబ్బ వాణి, ముచుపల్లి అవినాష్, ఎక్స్ అఫీషియో సభ్యుడు పెద్దింటి నీలకంఠ శర్మ, అర్చకులు కొడమంచిలి శ్రీరామచంద్రమూర్తి తదితరులు పాల్గొన్నారు.

చర్చి ప్రారంభం



చర్చి ప్రారంభానికి ప్రార్థన చేస్తున్న పాస్టర్లు

కడియం: పొట్టిలంకలో నిర్మించిన బైబిలు మిషన్ సెయింట్ దేవదాస్ పెనూయేలు ప్రార్థనా మందిరం శనివారం ఘనంగా ప్రారంభించారు. అంతర్జాతీయ బైబిలు మిషన్ వైస్ ప్రెసిడెంట్ రెవరెండ్ పి.జానదేవదాస్, జాయింట్ సెక్రటరీ రెవరెండ్ జె.ఆగమనరావుల ఆశీర్వాద ప్రార్థన అనంతరం ప్రారంభించారు. బైబిలు మిషన్ కొత్తపేట జోన్ పాలకవర్గ సభ్యులు రెవరెండ్ యం.ప్రవక్త యెషయా అధ్యక్షత వహించారు.ఎస్. విమలా యేసు రత్నం మందిరం విశిష్టతను వివరించారు. ఈ కార్యక్రమంలో బైబిలు మిషను పాలకవర్గ సభ్యులు, దైవసేవకులు పాల్గొన్నారు.

సాగర్‌కు సత్కారం



సాగర్ సత్కరిస్తున్న ముస్లిం నాయకులు

సీటీఆర్ఐ: ఆంధ్రప్రదేశ్ పారిశ్రామిక అభివృద్ధి సంస్థ రాష్ట్ర డైరెక్టర్ కానుబోయిన సాగర్‌కి అల్లా ఆశీస్సులుండాలని ముస్లిం నాయకులు ప్రార్థనలు చేశారు. శనివారం పవిత్ర మొహర్రం సందర్భంగా స్థానిక ఆజాద్ చౌక్ వద్ద ఉన్న లైన్ మసీదులో నమాజ్ చేసిన అనంతరం సాగర్‌ని సత్కరించారు. ఇటీవల జిల్లా పరిశ్రమల కమిటీలో ప్రత్యేక ఆహ్వానితుడిగా ప్రభుత్వం ఆయనను నియమించిన సందర్భంగా ముస్లిం నాయకులు దువా చేసి వారి సంప్రదాయ పద్ధతిలో సన్మానించారు. ఈ కార్యక్రమంలో హబీబుల్లాఖాన్, రబ్బాని తదితరులు పాల్గొన్నారు.

ధవళేశ్వరంలో మొహర్రం



ధవళేశ్వరంలో పీర్లను ఊరేగిస్తున్న కమిటీ సభ్యులు

ధవళేశ్వరం: మొహర్రం సందర్భంగా శనివారం ధవళేశ్వరంలో పీర్లను ఊరేగించారు. ధవళేశ్వరంలో 1847లో ఏర్పడిన ఇమామ్ హుస్సేన్ అస్థానానికి సంబంధించి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇమామ్ హుస్సేన్ ఇస్లాం మతం హక్కులను కాపాడడం కోసం జరిగిన యుద్ధంలో వీరోచిత పోరాటం చేసి వీర మరణం పొందారని ఆయనను స్మరిస్తూ మొహర్రం నిర్వహిస్తున్నామని అస్థానం కమిటీ సభ్యులు తెలిపారు.

ఘనంగా రక్షణాలయం యూత్ ట్రీట్

సీటీఆర్ఐ: స్థానిక సువిశేషపురంలో ఉన్న రక్షణాలయం సెయింట్ జోన్ పేరిష్ చర్చిలో శనివారం యూత్ ట్రీట్ కార్యక్రమం ఘనంగా జరిగింది. జిల్లాలోని సుమారు 30 చర్చిల నుంచి ఏఈఎల్‌సీ చర్చి యువ ప్రతినిధులు 400 మంది ఈ కార్యక్రమంలో పాల్గొని యువతను చైతన్య పరిచారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో బెంగళూరుకు చెందిన వర్షిప్ లీడర్ బ్రదర్ జోయల్ ఎస్.బాబు అద్భుతమై వాక్య పరిచర్యతో ఆకట్టుకున్నారు. కార్యక్రమంలో రాచపల్లి ప్రసాద్, పి.నైసీ పోతుమూడి, పి.విజయ్ ఆనంద్ రాజ్ తదితరులు పాల్గొన్నారు.

కోడిపందేల శిబిరంపై దాడి

ధవళేశ్వరం: రాజమహేంద్రవరం రూరల్ మండలం రాజవోలు గ్రామంలో నిర్వహిస్తున్న కోడి పందేల శిబిరంపై పోలీసులు దాడి చేశారు. ఈ దాడిలో 11 మందిని అదుపులోకి తీసుకోగా, వారి నుంచి రెండు కోళ్ళు, రూ.2300 నగదు, 9 ద్విచక్రవాహనాలు సాధ్వీనం చేసుకున్నారు. ధవళేశ్వరం సీఐ కె.మంగాదేవి ఆధ్వర్యంలో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అందాల హరిఇల్లు

- పేదల సొంతింటి కల సాకారం
- మండలంలో 14,969 మందికి ఇళ్లస్థలాలు
- లబ్ధిదారుల్లో ఆనందం



తొర్రేడులో నిర్మాణం పూర్తయిన ఇల్లు



తొర్రేడు జగనన్నకాలనీలో నిర్మాణంలో ఉన్న గృహాలు

రాజమహేంద్రవరం రూరల్: ఇల్లు కట్టి చూడు.. పెళ్లి చేసి చూడు అంటుంటారు పెద్దలు. అలాంటి కలను వైఎస్సార్ సీపీ ప్రభుత్వం సాకారం చేసింది. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సారథ్యంలో ప్రభుత్వం అర్హులందరికీ అందాల హరివిల్లు అందిస్తోంది. నవరత్నాలు–పేదలందరికీ ఇళ్లు కార్యక్రమంలో భాగంగా మండలంలోని తొర్రేడు జగనన్న కాలనీలో గృహ నిర్మాణం వేగం పుంజుకుంది. వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి మండలంలో 14,969 మందికి ఇళ్లస్థలాల పట్టాలు అందిచారు. మండలంలో పేదలకు తొర్రేడు, కోరుకొండ మండలంలో కానవరం, కాపవరం, మధురపూడి, నిడిగట్ల గ్రామాల్లో ఇళ్లస్థలాలను కేటాయించారు. టీడీపీ నేతలు పేదల ఇళ్లకు అడ్డు తగిలి కానవరం, కాపవరం, మధురపూడి, నిడిగట్ల స్థలాలపై కోర్టును ఆశ్రయించడంతో ఇళ్ల నిర్మాణానికి జాప్యం ఏర్పడింది. ఇటీవల కోర్టు అడ్డంకులు తొలగిపోవడంతో త్వరలోనే లేఅవుట్లు వేసి ఇళ్ల నిర్మాణాలు ప్రారంభించారు. తొర్రేడు గ్రామంలోని జగనన్న కాలనీలో గృహనిర్మాణాలు వేగవంతమయ్యాయి. లబ్ధిదారునికి గృహ నిర్మాణ శాఖ ద్వారా రూ.1.80 లక్షలు పూర్తి రాయితీతో రుణం అందిస్తున్నారు. అలాగే రాయితీపై సిమెంట్, ఇసుకతో పాటు ఐరన్ కూడా ప్రభుత్వం అందజేస్తోంది. ఇంటి పునాదులకు రూ.51,200, గోడలు నిర్మిస్తే రూ.53,200, శ్లాబ్ వేసుకుంటే రూ.22,400, ప్లాస్టింగ్‌లు పూర్తయితే మరో రూ.23,200 నగదు నేరుగా లబ్ధిదారులకు అందిస్తున్నారు. మహిళా సంఘాలకు అదనంగా మరో రూ.50వేల రుణాన్ని ఇస్తున్నారు. జగనన్న కాలనీలో రోడ్లు, తాగునీరు, విద్యుత్ సౌకర్యాలు కల్పించడంతో లబ్ధిదారుల నిర్మాణాలు జోరుగా చేపడుతున్నారు.

తొర్రేడు జగనన్న కాలనీలో లబ్ధిదారుల వివరాలు

మంజూరైన స్థలాలు	: 2454
గృహరుణాల లబ్ధిదారులు	: 2232
పునాది స్థాయిలో ఇళ్లు	: 1263
గోడలు పూర్తయినవి	: 459
రూఫ్‌లెవెల్	: 107
రూఫ్ కంప్లీటెడ్	: 13
మొత్తం పూర్తయినవి	: 365
ఇంకా ప్రారంభించనవి	: 25

నా కల తీరింది



ఎన్నో ఏళ్ల నుంచి అద్దె ఇంటిలోనే ఉంటున్నాం. గత ప్రభుత్వాలలో ఇళ్లస్థలాలు కోసం దరఖాస్తు చేసినప్పటికీ సొంతింటి కల నెరవేరలేదు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వంలో దరఖాస్తు చేసుకున్న 90 రోజుల్లో సొంత ఇంటిస్థలం పట్టాను తీసుకువచ్చి చేతిలో పెట్టారు. తొర్రేడు జగనన్న కాలనీలో ప్రభుత్వం సాయంతో గృహనిర్మాణం మొదలు పెట్టాం. నాకు జీవితంలో తీరదు అనుకున్న సొంతింటి కల సీఎం జగనన్నతో సాకారమైంది. ఆయనకు జీవితాంతం రుణపడి ఉంటాం.

– ఆకాశం గౌరీష్‌బాబు, లబ్ధిదారుడు, కాతేరు

సీఎంకు రుణ పడి ఉంటాం



ఇంటిలో పనులు చేసుకుంటూ కుటుంబాన్ని నెట్టుకొస్తున్నాం. ఎన్నో ఏళ్లుగా అద్దె ఇళ్లల్లో ఉంటూ అనేక ఇబ్బందులు పడుతున్నాం. జగనన్న సర్కారు వచ్చిన తర్వాత తొర్రేడు లేఅవుట్‌లో ఇచ్చిన స్థలంతో పాటు ప్రభుత్వం అందించిన రూ.1.80లక్షల పూర్తిరాయితీతో ఇచ్చిన రుణంతో ఇంటి నిర్మాణం చేపడుతున్నాం. సొంతింటి కల నేరవేర్చిన సీఎం జగన్‌కు రుణ పడి ఉంటాం

– షేక్‌చాన్‌బీ, లబ్ధిదారురాలు, కొంతమూరు

పాస్టర్ సేవలు అభినందనీయం



సతీష్‌కుమార్ సత్కరిస్తున్న రాజానగరం ఎమ్మెల్యే జక్కంపూడి రాజా తదితరులు

సీటీఆర్ఐ: పాస్టర్ సతీష్‌కుమార్ సేవలు అభినందనీయమని వైఎస్సార్ సీపీ తూర్పుగోదావరి జిల్లా అధ్యక్షుడు, రాజానగరం ఎమ్మెల్యే జక్కంపూడి రాజా అన్నారు. డాక్టర అబ్దుల్ కలాం వర్ధంతి సందర్భంగా గ్లోబల్ పీస్ కల్చరల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గురువారం విజయవాడలో జాతీయ పురస్కారాలను అందజేశారు. అందులో భాగంగా జీఎస్‌జే మినిస్ట్రీస్ సీఈఓ. పాస్టర్ సీహెచ్ సతీష్‌కుమార్‌కి అబ్దుల్ కలాం జాతీయ పురస్కారాన్ని అందించారు. ఈ సందర్భంగా శనివారం ఎమ్మెల్యే జక్కంపూడి రాజా నివాసంలో ఆయనను కలుసుకుని పురస్కార వివరాలను సతీష్‌కుమార్ తెలియజేశారు. కరోనా సమయంలో మినిస్ట్రీస్ ద్వారా చేసిన సేవలకు ఈ పురస్కారం లభించిందని తెలిపారు. అంతే కాకుండా రెండు తెలుగు రాష్ట్రాలలో 20 మందిని ఎంపిక చేస్తే తూర్పుగోదావరి జిల్లా నుంచి సతీష్‌కుమార్ ఎంపిక కావడం అభినందనీయమని జక్కంపూడి రాజా అన్నారు. సతీష్ కుమార్‌ని శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కోఆర్డినేటర్ నరవా గోపాలకృష్ణ,ప్రముఖ సామాజిక వేత్త అద్దంకి రాజా యోనా తదితరులు పాల్గొన్నారు.

యువకుడి అదృశ్యం

కంబాలచెరువు: స్థానిక కాతేరుకు చెందిన ఎస్.శ్రీనివాస్ అదృశ్యమైన సంఘటనపై మూడో పట్టణ పోలీస్ స్టేషన్‌లో శనివారం కేసు నమోదైంది. ఈనెల 26 నుంచి తన అన్నయ్య కనిపించడంలేదని ఆ యువకుడి చెల్లి ఐశ్వర్య పోలీసులకు ఫిర్యాదు ఇచ్చింది. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నిందితులను శిక్షించాలి

కంబాలచెరువు: మణిపూర్ రాష్ట్రంలో మారణహోమాన్ని ఆపాలని, మహిళలపై అత్యాచారం చేసిన వారిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేస్తూ ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం ఆధ్వర్యంలో శనివారం ధర్నా నిర్వహించారు. ఆ సంఘ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి ఎస్.కిరణ్ కుమార్ మాట్లాడుతూ మణిపూర్ రాష్ట్రంలో జరుగుతున్న అల్లర్లను కేంద్రం వెంటనే ఆపాలన్నారు. కార్యక్రమంలో జిల్లా కోశాధికారి కె.భాను ప్రసాద్, దినేష్, ధర్మేష్, మావో, అరుణ జ్యోతి, ప్రవల్లిక, మాధవి, వసంత, తదితరులు పాల్గొన్నారు.

నియోజకవర్గాన్ని ఆరోగ్యవంతంగా తీర్చిదిద్దుతా

మధురపూడి: రాజానగరం నియోజకవర్గంలోని ప్రజలందరూ ఆరోగ్యవంతంగా ఉండాలన్న లక్ష్యంతో ఉచిత వైద్య శిబిరాలను నిర్వహిస్తున్నట్టు ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు జక్కంపూడి రాజా అన్నారు. శనివారం కోరుకొండ మండలం గాదరాడ గ్రామం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో నిర్వహించిన ఉచిత మెగా వైద్య శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. ముందుగా తన తండ్రి జక్కంపూడి రామ్మోహనరావు విగ్రహానికి పూలమాలలు వేసి, నివాళులు అర్పించారు. జీఎస్‌ఎల్, సుబ్రద్ర హాస్పటల్స్ సౌజన్యంతో నిర్వహించిన శిబిరంలో సుమారు వెయ్యి మందికి వైద్య పరీక్షలు చేసి, మందులు అందజేశారు. ఈ కార్యక్రమంలో కోరుకొండ జెడ్పీటీసీ కర్రి నాగేశ్వరరావు, ఏఎంసీ చైర్మెన్ నక్కా రాంబాబు, పార్టీ మండల కన్వీనర్ అడపా కనకరాజు, కో–కన్వీనర్ గణేశుల పోసి, నాయకులు హరిబోలు చినబాబు, సర్పంచులు, ఎంపీటీసీ, మాజీ ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

మహాశక్తితో మహిళలకు భరోసా

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): మహానాడులో చంద్రబాబు ప్రవేశపెట్టిన మినీ మేనిఫెస్టోలో మహాశక్తి పథకంతో మహిళలకు భరోసా కలుగుతుందని టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు, ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చియ్యచౌదరి అన్నారు. శనివారం నగరపాలక సంస్థ పరిధిలోని 16వ డివిజన్ వాంబేగృహాల వద్ద మహాశక్తి కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మహిళా నేతలు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

ప్రమాదాలు జరిగితే ఉపేక్షించేది లేదు

- ఎంపీ మార్గాని భరత్‌రామ్
- మోరంపూడి ఎఫ్ఓబీ పనుల పరిశీలన



మోరంపూడి ఎఫ్‌వోబీ పనులపై ఆరా తీస్తున్న ఎంపీ భరత్‌రామ్, చిత్రంలో వైఎస్సార్ సీపీ అర్బన్ కోఆర్డినేటర్ గూడూరి శ్రీనివాస్

రాజమహేంద్రవరం రూరల్: మోరంపూడి జంక్షన్ వద్ద ఏ ప్రమాదం జరిగినా, ప్రాణ నష్టం జరిగినా సహించేది లేదని ఫ్లై ఓవర్ బ్రిడ్జి నిర్మాణ కాంట్రాక్టర్‌ను వైఎస్సార్ సీపీ పార్లమెంటరీ చీఫ్ విప్, రాజమండ్రి ఎంపీ మార్గాని భరత్ రామ్ హెచ్చరించారు. రాజమండ్రి నగరంలోని మోరంపూడి జంక్షన్ వద్ద ఫ్లై ఓవర్ బ్రిడ్జి నిర్మాణ పనులను శనివారం ఆయన పరిశీలించారు. జరుగుతున్న పనులపై సంతృప్తి వ్యక్తం చేశారు. గత రెండు వారాల్లో పరిశీలించిన పనులు, ఇచ్చిన టార్గెట్‌లో వర్షాల కారణంగా కాస్తంత జాప్యం జరిగినా మొత్తంపై పనులు త్వరితగతిన జరుగుతున్నాయని ఎంపీ భరత్ మీడియాకు తెలిపారు. ఎఫ్ఓబీ 8 పిల్లర్స్ పనులు దాదాపు పూర్తయ్యాయని తెలిపారు. ఆర్ఈ ప్యానల్స్ నిర్మాణ పనులు ప్రారంభించాల్సి ఉందని, ఇందు కోసం మోరంపూడి జంక్షన్ జాతీయ రహదారికి రెండు వైపులా ట్రాఫిక్ నియంత్రణ చేయాల్సిన అవసరం ఉందన్నారు. విశాఖ, విజయవాడ వైపుగా వచ్చే వాహనాల ట్రాఫిక్‌ను మళ్లించాలని, వారం పది రోజుల్లో ట్రాఫిక్ పోలీసులు ఇందుకు సంబంధించి చర్యలు తీసుకోనున్నట్టు ఆయన తెలిపారు. వచ్చే ఆగస్టు నెలాఖరు నాటికి ఇచ్చిన టార్గెట్‌ను పూర్తి చేయాలని కాంట్రాక్టు నిర్వాహకులను ఆదేశించారు. పనులు జరిగే చోట తప్పనిసరిగా ఫ్లడ్ లైట్స్ ఏర్పాటు చేయాలని, కనీసం 30 ఫ్లడ్ లైట్లు ఉండాలని, ఇక్కడ ప్రమాదాలు జరిగితే ఎవరి బాధ్యత అని కాంట్రాక్ట సిబ్బందిని ప్రశ్నించారు. అప్రమత్తంగా పనులు చేయాలని హెచ్చరించారు. ఆయన నేషనల్ హైవే పీడీ డీ సురేంద్ర, పార్టీ అర్బన్ కోఆర్డినేటర్ డాక్టర్ గూడూరి శ్రీనివాస్, మార్గాని సురేష్, మజ్జి అప్పారావు, చీరా రాజు, బొప్పన సుబ్బారావు, ఆరే చిన్ని, దుంగా మంగా లక్ష్మి, దుంగా సురేష్, సుందర్ సింగ్ తదితరులు ఉన్నారు.

పునరావాస కేంద్రాన్ని పరిశీలించిన 'చందన'



పునరావాసకేంద్రంలో మత్స్యకారులతో ఏర్పాట్లపై ఆరాతీస్తున్న చందన నాగేశ్వర్

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): స్థానిక ఆల్కాట్‌తోటలోని మున్సిపల్ కల్యాణ మండపంలో ఏర్పాటు చేసిన పునరావాసా కేంద్రాన్ని వైఎస్సార్ సీసీ రూరల్ కోఆర్డినేటర్, ఏపీ గ్రీనింగ్ అండ్ బ్యూటిఫికేషన్ కార్పొరేషన్ చైర్మన్ చందన నాగేశ్వర్ పరిశీలించారు. ఈ సందర్భంగా అక్కడ ఆశ్రయం పొందుతున్న మత్స్యకార కుటుంబాలను కలిసి వసతులు, భోజనాలు ఏర్పాట్లపై ఆరా తీశారు. అనంతరం ఎంహెచ్‌వో డాక్టర్ వినూత్న, రెవెన్యూ అధికారులతో పునరావాస కేంద్రంలో వైద్య శిబిరం, వసతుల గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా చందన నాగేశ్వర్ మాట్లాడుతూ గోదావరి వరద ఉధృతి అధికమవడంతో గోదావరి లంక గ్రామాలైన కేతా వారి లంక, వేదుమల్ల లంక, బ్రిడ్జ్ లంక వంటి ప్రాంతాలు ముంపునకు గురి కావడం వలన అక్కడి ప్రజలను మున్సిపల్ కల్యాణమండపం , అంబేద్కర్ కమ్యూనిటీ హాల్ వద్ద పునరావాసం కేంద్రాలకు తరలించామన్నారు. సుమారు 300 మందికి పైగా ఆశ్రయం పొందుతున్నారని, వారికి అన్ని సదుపాయాలు అందుతున్నాయన్నారు. వరద ప్రభావం తగ్గే వరకూ ఆశ వర్కర్లు, ఏఎన్ఎం అందుబాటులో ఉంటారని తెలిపారు. రాష్ట్రఖాదీబోర్డు వైస్‌చైర్మన్ పిల్లినిర్మల, పార్టీరాష్ట్ర కార్యదర్శి మింది నాగేంద్ర, జేసీఎస్ కన్వీనర్ రాజమౌళి, కన్నమ్మతల్లి గుడి చైర్మన్ దుంపా చంద్రారెడ్డి, ఆర్యాపురం అర్బన్ బ్యాంకు డైరెక్టర్ బిల్డర్ చిన్న, అంగాడి సత్యప్రియ, పడమటి కామరాజు, బాబ్జిరెడ్డి, దమ్ముప్రసాద్, మత్సేటి శివ తదితరులు పాల్గొన్నారు.

పెరుగుతున్న గోదావరి వరద

అప్రమత్తమవుతున్న లంక రైతులు



కడియపులంక వద్ద నుంచి మొక్కలను ఎగువకు తరలించే ఏర్పాట్లు చేస్తున్న రైతులు

కడియం: గోదావరి ఉగ్రరూపం దాల్చింది. వరద గట్టు చేరుతోంది. దీంతో లంకల్లోని రైతులు అప్రమత్తమయ్యారు. మండలం పరిధిలోని వేమగిరి, కడియపులంక, పొట్టిలంక తదితర గ్రామాల పరిధిలో సుమారు నాలుగు వేల ఎకరాలకు పైగా లంకభూములు ఉన్నాయి. గోదావరి మధ్యలో ఉండే ప్రధాన పాయకు, ఏటి గట్టుకు మధ్యన ఈ భూములు ఉంటాయి. వీటిలో నర్సరీ మొక్కలు, అరటి, జామ, పువ్వుల తోటలు వంటివి రైతులు సాగు చేస్తున్నారు. భద్రాచలం వద్ద నీటిమట్టం పెరగడంతో 24 గంటల వ్యవధిలోనే ధవళేశ్వరం బ్యారేజి దిగువకు ఆ నీరు చేరుతుందని అంచనా వేస్తున్నారు. దీంతో లంక ప్రాంతాలు నీట మునిగే అవకాశం ఉంటుందని భావిస్తున్నారు. ఈ నేపథ్యంలో ఇప్పటికే లంకల్లోని పశువులను, వ్యవసాయ పనిముట్లను ఎగువ ప్రాంతానికి తరలించారు. పల్లపు ప్రాంతాల్లోని మొక్కలను ఎగువ ప్రాంతాలకు తరలించుకునేందుకు చర్యలు చేపట్టారు. వ్యాన్లు, లారీలపై మొక్కలను ఏటి గట్టు ఇవతలి వైపునకు తరలిస్తున్నారు. అలాగే బొప్పాయి, జామ, పువ్వులను వీలైనంత వరకు కోసుకునే ప్రయత్నాల్లో రైతులు ఉన్నారు. ఏటి గట్టు వెంబడి వ్యవసాయ ఉత్పత్తులను తరలించుకునే హడావిడిలో రైతులు, కూలీలు కన్పిస్తున్నారు. వేమగిరి ఊదాలమ్మ ఆలయం, వేమగిరి–కడియపులంక ఇసుక ర్యాంపుల వద్ద రెవెన్యూ, పోలీసు అధికారులు పికెట్లు ఏర్పాటు చేశారు. వరద పరిస్థితిని ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నారు.

ఎమ్మెల్యే ఎక్కడని ప్రజలు అడుగుతున్నారు

- టీడీపీ నాయకులపై మండిపడ్డ వైఎస్సార్ సీపీ నగర అధ్యక్షుడు శ్రీహరి



సమావేశంలో మాట్లాడుతున్న వైఎస్సార్ సీపీ నగర అధ్యక్షుడు అడపా శ్రీహరి

రాజమహేంద్రవరం సిటీ: ఓటు వేసి గెలిపించిన ఎమ్మెల్యే ఆదిరెడ్డి భవానీ ఎక్కడ ఉన్నారని, ప్రజా సేవలో ఉండాల్సిన ఆమె ఏం చేస్తున్నారని ప్రజలు అడుగుతున్నారని వైఎస్సార్ సీపీ నగర అధ్యక్షుడు అడపా శ్రీహరి అన్నారు. శనివారం ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీహరి మాట్లాడుతూ ప్రస్తుతం నగరంలో జరుగుతున్న అభివృద్ధి అంతా ఎంపీ మార్గాని భరత్‌రామ్ నాయకత్వంలోనే జరుగుతోందన్నారు. ఈ అభివృద్ధి పనులు చేయడంతో వైఎస్సార్ సీపీకి, ఎంపీకు లభించిన ఆదరణను చూసి ఓర్వలేక టీడీపీ నాయకులు ఆదిరెడ్డి వాసు తదితరులు తమ అక్కసును వెళ్లగక్కుతూ పస లేని అర్థం పర్థం ఆరోపణలు చేస్తున్నారని మండిపడ్డారు. ప్రజా క్షేత్రంలో తాము ప్రజా సమస్యలు తెలుసుకునేందుకు ప్రజల వద్దకు వెళుతుంటే ఎమ్మెల్యే ఆదిరెడ్డి భవానీ కనిపించడం లేదని ప్రజలే అడుగుతున్నారన్నారు. కార్యక్రమాలకు పిలవడం లేదని, ఎమ్మెల్యేకు కనీస గౌరవం ఇవ్వడం లేదని చేసిన ఆరోపణల్లో వాస్తవం లేదన్నారు. ఒక వేళ ప్రోటోకాల్ ప్రకారం పిలుపు లేకపోతే ప్రజాపక్షంలో అడగొచ్చని అన్నారు. ఎమ్మెల్యే ప్రజలకు సేవలందించడం మానేసి హైదరాబాద్, ఢిల్లీలో కూర్చొంటే కుదరదని అన్నారు. ఆదిరెడ్డి వాసు రౌడీయిజం మానేసి ప్రజా సమస్యలను గుర్తించాలన్నారు. టీడీపీ ప్రత్యేక హోదా కోసం కాదు ప్యాకేజీ కోసం పోరాడిందన్నారు. టీడీపీ నాయకులు చేసిన అక్రమాలు, అవినీతి ప్రజలకు తెలుసన్నారు. బీసీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ పాలిక శ్రీను, మాజీ కార్పొరేటర్ అజ్జరపు వాసు, గుత్తుల భాస్కర్, పెంకే సురేష్, రేగుళ్ల భాల శ్రీధర్,నందం స్వామి, అవినాష్ తదితరులు పాల్గొన్నారు.

ఆలయ విశిష్టతను కాపాడేందుకు కృషి చేయండి



ఉమా కోటిలింగేశ్వర స్వామివారి ఆలయంలో ట్రస్టుబోర్డు సభ్యులతో ప్రమాణ స్వీకారం చేయిస్తున్న ఎంపీ

- ఎంపీ భరత్‌రామ్
- ఉమా కోటిలింగేశ్వర, సీతారామ స్వామివార్ల పాలకమండలి ప్రమాణ స్వీకారం

సీటీఆర్ఐ(రాజమహేంద్రవం): రాజమహేంద్రవరం నగరంలో దాదాపు వెయ్యి సంవత్సరాల ఘన చరిత్ర ఉన్న ఉమా కోటిలింగేశ్వర స్వామి, సీతారామ స్వామి ఆలయ విశిష్టతను కాపాడి గత వైభవాన్ని తీసుకురావాలని ఆలయ ధర్మకర్తల మండలిని వైఎస్సార్ సీపీ పార్లమెంటరీ చీఫ్ విప్, రాజమహేంద్రవరం ఎంపీ మార్గాని భరత్ రామ్ కోరారు. శనివారం ఈ ఆలయ నూతన పాలకమండలి ప్రమాణ స్వీకారోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ధర్మకర్తల మండలి చైర్మన్ అరిగెల బాబూ నాగేంద్ర ప్రసాద్, డైరెక్టర్లతో ఎంపీ భరత్ ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ సందర్భంగా ఎంపీ భరత్, వైఎస్సార్ సీపీ సిటీ కోఆర్డినేటర్ డాక్టర్ గూడూరి శ్రీనివాస్ మాట్లాడుతూ ఉమా కోటిలింగేశ్వర స్వామి ఆలయానికి ఎంతో ప్రత్యేకత ఉందన్నారు. ఒక వెబ్‌సైట్ రూపొందించి ఆలయ చరిత్ర, విశిష్టత పొందుపరచాలని సూచించారు. తొలుత ఎంపీ భరత్, డాక్టర్ గూడూరి, అడపాలను పండితులు వేద మంత్రాలతో పూర్ణకుంభ స్వాగతం పలికారు. ప్రత్యేక దర్శనం, గోత్ర నామాలతో విశేష పూజలు నిర్వహించారు.

నూతన పాలకవర్గం

ఉమా కోటిలింగేశ్వర స్వామి, సీతారామ స్వామి ఆలయానికి ధర్మకర్తల మండలి చైర్మన్‌గా అరిగెల బాబునాగేంద్ర ప్రసాద్, సభ్యులుగా పీవీవీ రమణ, వై.నాగరాజు, వంగ ఉమ, ఎస్.విజయలక్ష్మి, కె.దేవి పోసయ్య, గుడే పార్వతి, కే లక్ష్మిశైలజ, గారవిజయ కుమారి, కోఆప్షన్ సభ్యుడిగా కె.నాగేశ్వరరావు ప్రమాణ స్వీకారం చేశారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ

రాజమహేంద్రవరం నగరానికి చెందిన ఇద్దరికి రాష్ట్ర ముఖ్యమంత్రి సహాయ నిధి మంజూరు కాగా, వాటికి సంబంధించిన చెక్కులను ఎంపీ భరత్ రామ్ లబ్ధిదారులకు అందజేశారు. దొడ్డి నూకరత్నంకు రూ.6 లక్షలు, గూడాల లక్ష్మికి రూ.1,54,745 సీఎం సహాయ నిధి నుంచి మంజూరయ్యాయి.

సనాతన ధర్మ పరిరక్షణకు ఆలయాలలో నృత్యప్రదర్శనలు

- ఆగస్టు 11 నుంచి సంపూర్ణ భారత యాత్ర ప్రారంభం
- శ్రీరాధాకృష్ణ కళాక్షేత్ర నిర్వాహకుడు డాక్టర్ నారాయణ వెల్లడి



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న శ్రీరాధాకృష్ణ కళా క్షేత్ర నిర్వాహకుడు

సీటీఆర్ఐ(రాజమహేంద్రవరం): సనాతన ధర్మం, సాంస్కృతిక సంపద పరిరక్షణ కోసం దేశంలోని పురాతన దేవాలయాలలో నృత్యాభినయం నిర్వహిస్తామని శ్రీరాధాకృష్ణ కళాక్షేత్ర నిర్వాహకుడు డాక్టర్ జీబీ నారాయణ అన్నారు. శనివారం రాజమహేంద్రవరం ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడతూ ఆగస్టు 11వతేదీ నుంచి అక్టోబర్ 12 వరకూ 63 రోజుల పాటు 22 రాష్ట్రాల మీదుగా సంపూర్ణ భారత యాత్ర కొనసాగుతుందన్నారు. ఈ యాత్రను ఆగస్టు 11న కలెక్టరేట్ నుంచి కలెక్టర్ డాక్టర్ కె.మాధవీలత జెండా ఊపి ప్రారంభిస్తారని చెప్పారు. 63 రోజులకు గుర్తుగా 63 అడుగుల జాతీయ జెండాని కలెక్టర్ ఆవిష్కరిస్తారని తెలిపారు. మినీ బస్సులో ఒడిశా, పశ్చిమ బెంగాల్, జార్ఖండ్, ఢిల్లీ, రాజస్థాన్, ఉత్తర్ఖాండ్, ఉత్తరప్రదేశ్ రాష్ట్రాల మీదుగా సుమారు 16 వేల కిలోమీటర్ల పొడవునా ఈ యాత్ర సాగనుందన్నారు. ఆసక్తి ఉన్న తల్లిదండ్రులు తమ పిల్లలను నేరుగా ప్రదర్శనలకు తీసుకురావచ్చన్నారు.